



నారాయణపేటలో బతుకమ్మలతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

రచ్చకెక్కిన పంచాయితీ

- మలుపులు తిరుగుతున్న కమిషనర్, మాజీ కౌన్సిలర్ గొడవ
- కార్పొరేషన్ అధికారులు మూకుమ్మడిగా కలెక్టర్‌కు ఫిర్యాదు
- అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన కమిషనర్
- కట్టాను అరెస్టు చేసి రిమాండ్ చేసిన పోలీసులు

7

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక 7

ప్రాదేశిక ఎన్నికలకు రంగం సిద్ధం

- రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు
- సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందజేత
- ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి
- 930 పోలింగ్ కేంద్రాలు, 4,99,582 మంది ఓటర్లు
- దసరా పండుగ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల!



మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాదేశిక ఎన్నికలకు జిల్లా యంత్రాగం పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యింది. రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి సోమవారం ఉదయం ఆదేశించింది. దీంతో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలను ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసుకొని జిల్లా కేంద్రానికి రావాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవో, డీపీవోలతో రిజర్వేషన్ల ప్రక్రియను ప్రారంభించారు.

సోమ, మంగళవారాల్లో రాత్రి పొద్దుపోయే వరకు అధికారులు సమావేశమై గ్రామాల్లో వార్డుల వారీగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు. ఎన్నికల నిర్వహణకు అధికారులను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని మంగళవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఆర్‌వోలను, ఏఆర్‌వోలను, స్టేజ్ -2 ఆధికారులను నియమించే పనిలో నిమగ్నమయ్యారు. వారికి ఈ నెల 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రాదేశిక ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ అనంతరం విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్‌వోలు, ఏఆర్‌వోల నియామకం

ప్రాదేశిక, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, స్టేజ్ -2 అధికారులను నియమించారు. ప్రాదేశిక ఎన్నికలకు 19 మంది ఆర్‌వోలు, 72 మంది ఏఆర్‌వోలను నియమించినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 144 మంది రిటర్నింగ్ అధికారులు, 423 మంది ఏఆర్‌వోలను నియమించారు. పీవోలు 2,620, ఓపీవోలు 3,351 మంది అధికారులను నియమించనున్నారు. వారిని క్లస్టర్ల వారీగా ఆర్‌డీవోలు నియమించి జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

16 జడ్పీటీసీ, 175 ఎంపీటీసీ స్థానాలు

మహబూబ్‌నగర్ జిల్లాలో 16 జడ్పీటీసీ, 175 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు 930 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. మొత్తం ఓటర్లు 4,99,582 మంది ఉన్నారు. వారిలో మహిళలు 2,51,349, పురుషులు 2,48,222, ఇతరులు 11 మంది ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 6న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు. 8న జిల్లా కేంద్రంలో కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో, మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోల ఆధ్వర్యంలో అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. 10వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో తుది ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు.



మహబూబ్‌నగర్‌లోని జేపీఎన్‌సీఈలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు అధ్యాపకులు

రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో..

- ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. బుధవారం పాలమూరు పట్టణంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర బోయి వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా నృత్యం చేశారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. నారాయణపేట పట్టణంలోని భారంబావి వద్ద ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహాన్ని నింపారు.

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నారాయణపేట (ఆంధ్రజ్యోతి)

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

- ప్రారంభించనున్న క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- టోర్నీలో తలపడనున్న 240 మంది క్రీడాకారులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

6



స్టేడియంలో రాష్ట్ర స్థాయి టోర్నీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

- వచ్చే నెల 20 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా, సీసీకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చేనెల 20న బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. 22న కల్యాణోత్సవం, 26న అలంకారోత్సవం, 28న ఉద్దాల ఉత్సవం ఉంటాయన్నారు. అందుకోసం తాగు నీరు, పారిశుధ్యం, ఆహారం, ఉత్సవాలు, లా అండ్ ఆర్డర్ తదితర కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతర మైదానంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతగా పని చేసి విజయవంతం చేయాలని కోరారు. అలంకారోత్సవం, ఉద్దాలోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్‌ల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన బస్సు సర్వీసులు నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్, ఈవో మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



మూసాపేటలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

- సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- మూసాపేట, భూత్పూర్, జడ్చర్ల బాలానగర్ పోలీస్‌స్టేషన్ల తనిఖీ

భూత్పూర్/ మూసాపేట/ జడ్చర్ల / బాలానగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్ర తల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్‌లో సీఐ కార్యాలయం, మూసాపేట, జడ్చర్ల, బాలానగర్‌లలో పోలీస్‌స్టేషన్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలను తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడం, రోడ్డు ప్రమాదాలను నివారించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాత నేరస్థులపై గట్టి నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100పై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రతీ పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. అంతకు ముందు ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన వెంట ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రామకృష్ణ, కమలాకర్, నాగార్జున గౌడ్, ఎస్ఐలు ముల్కంపల్లి వేణు, లెనిన్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పాలన గాడి తప్పి, పెద్దలు లేని సంసారంలా మారిందన్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రతీ నెల ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు పంచాయతీ కార్యదర్శులు లక్షల రూపాయలు ఖర్చు చేశారని, బిల్లులు రాక అవస్థలు పడుతున్నారని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, రహదారులు దెబ్బతిన్నాయని చెప్పారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి

యూరియా మళ్లీ వచ్చింది

- జడ్చర్ల రేక్ పాయింట్‌కు చేరిన 2,282 మెట్రిక్ టన్నులు

జడ్చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల రైల్వేస్టేషన్‌లోని రేక్ పాయింట్‌కు బుధవారం 2,282 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకున్నది. ఐపీఎల్ కంపెనీకి చెందిన 1,340, ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 942 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అందులో మహబూబ్‌నగర్ జిల్లాకు 782 మెట్రిక్ టన్నులు కేటాయించారు.

నాగర్‌కర్నూల్ జిల్లాకు 880 మెట్రిక్ టన్నులు, నారాయణపేట జిల్లాకు 520 మెట్రిక్ టన్నులు ఇవ్వనున్నారు. మరో వంద మెట్రిక్ టన్నుల యూరియాను కమిషనర్ రిజర్వ్ పూల్‌లో నిల్వ ఉంచారు. అత్యవసర పరిస్థితిల్లో ఆ యూరియాను పంపిణీ చేయనున్నారు.



జగజ్జననీ ప్రణమామ్యహం

బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీ దేవిగా అమ్మవారు

మరిన్ని చిత్రాలు 6లో..

యూరియా కోసం అన్నదాతల గోస



దేవరకద్రలో యూరియా కోసం క్యూలో నిలుచున్న రైతులు

7


అయిజలో గాయత్రీదేవి అలంకరణలో కాళికామాత


నారాయణపేట అంబాభవానీ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


జడ్చర్ల వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో నవదుర్గ అలంకరణలో అమ్మవారి దర్శనం


కల్వకుర్తిలో అన్నపూర్ణాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


చంద్రఘంటా దేవి అలంకరణలో జోగులాంబ అమ్మవారు


గద్వాల తాయమ్మ ఆలయంలో మధుర మీనాక్షీ దేవిగా దర్శనం

జగజ్జననీ ప్రణమామ్యహం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలో జోగులాంబ అమ్మవారు చంద్రఘంటాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం కనుల పండువగా రథోత్సవం నిర్వహించారు. నారాయణపేటలోని అంబాభవానీ, కల్వకుర్తిలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తుల పూజలు అందుకున్నారు. జడ్చర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గద్వాల పట్టణంలోని తాయమ్మ ఆలయంలో అమ్మవారు మధుర మీనాక్షీ దేవిగా పూజలందుకున్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరిక
● రెండు రోజుల చికిత్స తరువాత మృతి
● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన


ఎల్లప్ప కుమార్ (ఫైల్)

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం గాలిలో కలిసింది. వైద్యుల నిర్లక్ష్యం, పేషంట్‌పై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. కడుపునొప్పితో ఆసుపత్రికి వస్తే కాటికి పంపిన సంఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

వనపర్తి పట్టణానికి చెందిన ఎల్లప్ప కుమార్ (37) ఈనెల 22న రాత్రి దాదాపు 10 గంటల సమయంలో కడుపు నొప్పి సమస్యతో వనపర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు పేషంట్‌కు రెండు రోజులు వైద్యం అందించారు. బుధవారం మధ్యాహ్నం కుమార్‌కు శరీరమంతా చెమటలు పట్టడం, మోషన్స్ రావడం గమనించిన కుటుంబ సభ్యులు వైద్యులకు సమాచారం ఇచ్చారు. పరిస్థితి ఇబ్బందిగా ఉన్నట్లుంది మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి పెద్ద ఆసుపత్రికి రెఫర్ చేయండి అంటూ కుటుంబ సభ్యులు వైద్యులకు మొరపెట్టుకున్నారు. ఏం పర్వాలేదు.. ఎక్కడికి వెళ్లినా ఇదే ట్రీట్‌మెంట్ ఉంటుంది.. ఏమీ కాదని వైద్యులు సమాధానం ఇచ్చారు. తీరా పేషంట్ ఎల్లప్ప కుమార్ బుధవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటలకు కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యుల రోదన గమనించిన వైద్యులు మృతదేహాన్ని చడీచప్పుడు లేకుండా అంబులెన్స్‌లో ఎక్కించారు.

ప్రాణం ఖరీదు రూ.10 లక్షలు!

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. సమస్య పెద్దది కాకుండా సెటిల్‌మెంట్ చేసుకోవాలనుకున్న ఆసుపత్రి యాజమాన్యం ఐఎంఏ (ఆలిండియన్ మెడికల్ అసోసియేషన్) వైద్యులు, పట్టణ రాజకీయ ప్రముఖుల సమక్షంలో రాజీ బేరానికి వచ్చారు. మృతుడు ఎల్లప్ప కుమార్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. దీంతో ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున రూ. 9 లక్షలు, సమాధి ఖర్చులకు లక్ష రూపాయలు ఇచ్చేందుకు రాజీ కుదుర్చుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను రాజీ కుదిర్చే సమయంలో రాజకీయ ప్రముఖులతో పాటు పోలీసులు కూడా ఉండటం కొసమెరుపు.

వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదు

ఆసుపత్రిలో జరిగిన పేషంట్ మృతి సంఘటనలో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని వనపర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ పూర్ణచందర్ తెలిపారు. జరిగిన సంఘటనపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పైవిధంగా ఆయన స్పందించారు. రోగికి వైద్యం చేస్తున్న క్రమంలోనే ఒక్కసారిగా హార్ట్ స్ట్రోక్ రావడంతో రోగి మృతి చెందాడన్నారు. కొద్ది రోజులుగా రోగి అనారోగ్యంతో ఉన్నప్పటికీ సరైన వైద్యం చేయించుకోకపోవడం, వాటికి తోడు రోగికి మద్యపానం అలవాటు ఉండటంతో వైద్యానికి శరీరం కూడా సహకరించలేదని తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

నవాబ్‌పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల సరిహద్దులోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో టిప్పర్‌లో మట్టి తీసుకువచ్చి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నట్లు రెండు టిప్పర్లను పట్టు కుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జనార్దన్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం రాత్రి పక్కా సమాచారం మేరకు సిబ్బందిని పంపగా ఖానాపూర్‌కు చెందిన శేఖర్, రవిలకు చెందిన టిప్పర్లతో పాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

టీఎస్‌పీఎస్‌సీ నూతన సభ్యుడికి సన్మానం

నారాయణపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన సభ్యుడిగా ఎంపికైన ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్‌ను బుధవారం నారాయణపేట జిల్లా వాసులు కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అప్పక్‌పల్లికి చెందిన తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బంగారి వెంకటయ్య నేతృత్వంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కథలప్ప, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ రాజేష్‌కుమార్, పీఈటీ పారిజాత లు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానించారు. నారాయణపేట జిల్లా వాసి అయిన లక్ష్మీకాంత్‌రాథోడ్ పీయూ మాజీ రిజిస్ట్రార్‌గా, శాతవాహన విశ్వ విద్యాలయాల్లో విద్యాఫ్యాకల్టీ డీన్, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతిగా, విశ్వవిద్యాలయాల క్రీడల కార్యదర్శిగా ఎన్నో సేవలందించారని కొనియాడారు.

ప్రతీ ఒక్కరికి న్యాయపరంగా సమాన హక్కులు

● లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు

ధరూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి న్యాయపరంగా సమాన హక్కులు ఉంటాయని, వినికిడి లోపం ఉన్నవారు కూడా న్యాయ సేవలకు అర్హులేనని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వి.రాజేందర్, బి.శ్రీని వాసులు అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ధరూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మా ట్లాడుతూ బధిరుల హక్కుల గురించి, వినికిడి లోపం గురించి అవగాహన పెంచడమే కార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. వినికిడి లోపం గల వారి హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన సేవల ప్రాధాన్యతపై వివరించా రు. అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వ సహా యాన్ని పొందాలని సూచించారు. అదే విధంగా వినికిడి లోపం ఉన్నవారు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ, ఆరోగ్య, విద్య అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో వినికిడి లోపం గల వ్యక్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ


జిల్లా ఫుట్‌బాల్ జట్టుతో ఎన్పీ. వెంకటేశ్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు

» ప్రారంభించనున్న క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
» టోర్నీలో తలపడనున్న 240 మంది క్రీడాకారులు
» ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వహకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి క్రీడా సంబురానికి మహబూబ్‌నగర్ పట్టణం వేదిక కానున్నది. జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో గురువారం 25వ తేదీ నుంచి 28 వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనున్నది. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు ఎన్‌పీ వెంకటేశ్, భానుకిరణ్‌లు బుధవారం టోర్నీ ఏర్పాట్లను పరిశీలించారు. పోటీలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు పట్టణంలోని లిటిల్‌స్కాలర్స్, రెయిన్‌బో, మాడ్రన్ స్కూళ్లలో బస ఏర్పాటు చే శారు. స్టేడియంలో భోజన వసతి కల్పిస్తున్నారు.

12 జిల్లాల నుంచి క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. వారితో పాటు 24 మంది కోచ్‌లు, 10 మంది సాంకేతిక నిపుణులు రానున్నారు. క్రీడా జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. గ్రూపు-ఏలో వనపర్తి, నిజామాబాద్, ఆదిలాబాద్, గ్రూపు-బీలో మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, గ్రూపు-సీలో సిద్దిపేట, నల్గొండ, రంగారెడ్డి, గ్రూపు-డీలో గద్వాల, మెదక్, వరంగల్ జట్లు ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం 11 గంటలకు టోర్నీ ప్రారంభం కానున్నది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నారు. వారితో పాటు ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీపీ ఫాల్గుణ, పీయూ మాజీ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొననున్నారు.

విజయవంతం చేస్తాం



రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీని అందరి సహకారంతో విజయవంతం చేస్తాం. ఇప్పటికే జిల్లా ప్రధాన స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 12 జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు, 34 మంది కోచ్‌లు, సాంకేతిక నిపుణులకు బస, భోజన వసతి కల్పిస్తున్నాం.

- ఎన్‌పీ వెంకటేశ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జిల్లా జట్టు క్రీడాకారులు వీరే

టోర్నీలో పాల్గొననున్న జిల్లా క్రీడాకారులు కే అరుణ్, డీ నిఖేష్, కే దినేశ్, ఎస్.రాములు, కే కృష్ణ, పీ శ్రీకాంత్, ఎం ప్రకాష్, ఎన్. నరేశ్, జీ స్నేహిత్, టీ సాయికృష్ణ, స్వామి, ఎం. కళ్యాణ్, జహంగీర్, కే శివప్రసాద్, జీ సూర్యప్రకాష్, కే ఆర్య, కే హిమకిరణ్, సమీర్‌బిన్‌మహ్మద్‌సిద్దిఖ్, కే లక్ష్మణ్‌గౌడ్, ఎం.ప్రేమ్‌కుమార్, కోచ్, మేనేజర్లుగా మీన్‌వాజీద్‌అలీ, రాజేంద్ర బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఘనంగా బోనాల పండుగ


బోనాలతో వస్తున్న మహిళలు

నవాబ్‌పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూర్ గ్రామంలో బుధవారం బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం మహిళలు బోనాలతో పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

బతుకమ్మ సంబురం

» బతుకమ్మ ఆడిన కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే జీఎంఆర్
» జేపీఎన్‌సీలో ఆడిపాడిన విద్యార్థులు


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్


పేటలో బతుకమ్మ సంబురాలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/విద్యావిభాగం సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఆవరణలో బుధవారం వివిధ శాఖలకు చెందిన మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, బతుకమ్మ ఆడారు. కలెక్టర్ విజయేందిర బోయి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డిరెడ్డి పూజలు చేసి బతుకమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ, చేనేత, జౌళిశాఖ, జిల్లా పరిషత్ తదితర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రం సమీపంలోని జయప్రకాష్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణమంతా అంతా పూల తోటను తలపించిది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటపాటలతో కోలాటం ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కమెడీయన్ శివారెడ్డి, కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ విద్యార్థులతో కలిసి సందడి చేశారు. కళాశాల కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిని గుర్తు చేసేదే బతుకమ్మ పండుగ అని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎంవీఎస్ కళాశాలలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతకు ముందు ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ ఆడాపారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, టీపీయూఎస్ అధ్యక్షుడు రాములు, ఉ పా. ధ్యక్షుడు వెంకట్‌రాములు, వర్కింగ్ ప్రెసిడెండ్ శివకుమార్ పాల్గొన్నారు.

● నారాయణపేట : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ సంబురాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం రాత్రి నారాయణపేట బారం బావి వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మలను ఎత్తుకొని తోటి మహిళలతో కలిసి ఆడి పాడారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ నిలిచిందని, స్త్రీల ఐక్యతను, సామాజిక కలయికను ఈ పండుగ ప్రోత్సహిస్తుందన్నారు. ఆ తర్వాత మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఎ మ్మెల్యే మట్టి గాజులు కొనుగోలు చేసి, అన్నిరకాల గాజులను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ చైర్మన్లు బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, మునిసిపల్ కమిషన ర్ నర్సయ్య, డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప తదితరులున్నారు.

కోస్గి : పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలోని 16 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, ఆయా కాలనీల మహిళలతో బతుకమ్మ ఆడారు. తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ, టీచర్లు ప్రసన్న, అనసూయ, అరుణ, సులోచన తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్‌లోని ఎంపీఎస్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు


కోస్గిలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్లు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

» ఖేలో భారత్ జిల్లా కన్వీనర్ రమేశ్
» స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి
» పెద్దకొత్తపల్లిలో విద్యార్థుల రాస్తారోకో


పెద్దకొత్తపల్లిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సమస్యలువెంటనే పరిష్కరించాలని ఖేలో భారత్ జిల్లా కన్వీనర్ రమేష్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో 167కే హైవేపై కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, లెక్చరర్ల కొరత తీర్చాలని, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనతో వాహనాలు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు దగ్గరకు చేరుకోవడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం విద్యార్థులచేత రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారుబాబు, నగర కార్యదర్శి ప్రసాద్‌కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ జ్ఞానేశ్వర్, రామకృష్ణ, చందు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల మేనేజర్‌గా స్వాములు



నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న 36వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ టీం మేనేజరుగా నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మేనేజరుగా స్వాములు ఎంపిక కావడంపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.విజేందర్‌యాదవ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సమస్యలు ఉంటే తెలుపండి


» వృద్ధాశ్రమం, బాలసదనం తనిఖీల్లో సీనియర్ సివిల్ న్యాయాధికారి


చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి వింధ్యానాయక్ దంపతులు

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, పిల్లలు ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా తెలుపాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యానాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని బారంబావి సమీపంలో ఉన్న వృద్ధాశ్రమం, బాల సదనం హోమ్‌ను బుధవారం ఆమె భర్త విజ య్‌నాథ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోమ్‌లో సిబ్బంది హాజరుపట్టికతో పాటు, ఆహార దినపట్టికలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, కూరగాయల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. వృద్ధులకు ఎప్పటికప్పుడు తగిన మందులు అందించాలని, మరుగుదొడ్లు, బెడ్‌షీట్లు పరిశుభ్రం గా ఉంచాలన్నారు. అనంతరం పిల్లలకు అరటి పండ్లు, జామ, సపోటా పండ్లను అందించారు. ఆ తర్వాత వృద్ధులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులకు తెలుపాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఇంటివారి లాగా చూసుకోవాలని ఆదేశించారు.

తైక్వాండోలో ప్రతిభ చాటాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు


తైక్వాండోలో బెల్టులు సాధించిన విద్యార్థులతో ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండోలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని తైక్వాండో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని రవీంద్రభారతి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలన్నారు. బెల్టు గ్రేడింగ్‌లో 15 మంది వివిధ విభాగాల్లో బెల్టులు సాధించినట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ నందీశ్వర్, జిల్లా అధ్యక్షుడు సాయిలు, కోశాధికారి శంకర్, సీనియర్ కోచ్ రాజేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్ ■ తాళం వేసిన ఇంట్లో దొంగతనం


దొంగతపం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

మదనాపురం సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వడ్డె రవి కిరణ్ ఇంట్లో దొంగతనం జరగగా బంగారు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూడగా దొంగలు ఇంటి తాళాలు విరగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు వస్తువులు, వెండితో పాటు రూ. 32వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దొంగతనం జరిగిన ఇంటిని పోలీసులు పరిశీలించి క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్స్‌ను పిలిపించి నేర స్థలం నుంచి వేలిముద్రలు సేకరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీహార్ రాష్ట్రంలోని వైశాలి జిల్లా బిదుపూర్ మండలంలోని మధురాపూర్ గ్రామానికి చెందిన సుమిత్ కుమార్ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రాజాశ్యామ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అతని కుటుంబ సభ్యులు గత కొన్నాళ్లుగా తిమ్మాజీపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ శివారులో స్నేహ పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని తన స్నేహితుని వివాహానికి వెళ్లొస్తానని... తనకు డబ్బులు ఇవ్వాలని తండ్రిని కోరాడు. తండ్రి ఎంతకు డబ్బులు ఇవ్వకపోవడంతో మంగళవారం మనస్తాపానికి గురైన సుమిత్‌కుమార్ పౌల్ట్రీఫామ్ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు చెట్టుకు వేలాడుతున్న అతన్ని చూసి సమాచారమివ్వగా కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. తల్లి సుచితాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మహిళకు గాయాలు

ఉండవల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి గ్రామంలో కుటుంబ వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈనెల 23వ తేదీ మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మధుబాబు, అతని భార్య మేరమ్మ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మేరమ్మ తన బంధువులను పిలవగా, వారు అక్కడికి చేరుకుని మధుబాబుపై దాడి చేశారు. వివాదాన్ని ఆపేందుకు ప్రయత్నించిన మధుబాబు పిన్ని ఈశ్వరమ్మపై కూడా మేరమ్మ రాయితో తలపై కొట్టి గాయపరచింది. అలాగే మేరమ్మ తమ్ముడు అజయ్, సాయి మరి కొందరు కలిసి ఈశ్వరమ్మను, మధుబాబును కొట్టి గాయపరిచినట్లు ఉండవల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీడ్ పత్తి పంటను తొలగించిన దుండగులు

మానవపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మానవపాడు మండల పరిధిలోని ఏ బూడిదపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన రెండు ఎకరాల్లో సీడు పత్తి పంటను సాగు చేశాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు సీడు పత్తి పంటను కొడవలితో కొమ్మలు, కాయలు తొలగించారని తెలిపారు. గత మూడు నెలల క్రితం పంట సాగు చేయగా కాయలు, పిందెలు వచ్చే సమయంలో ఇలా చేయడం ఇబ్బందిగా ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒక ఎకరాకు దాదాపుగా రూ.లక్షా 50 వేలు ఖర్చు చేసినట్లు వివరించాడు.

భూ వివాదంలో వ్యక్తిపై బెదిరింపు కేసు

ఉండవల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి గ్రామంలో ఇరు వర్గాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదంలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ సత్యనారాయణ సర్వే నెంబర్ 352లోని ఒక ఎకరా 13 గుంటల భూమిపై తన పొరుగున ఉన్న కురువ స్వాములు మధ్య చాలా కాలంగా సివిల్ కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ మంగళవారం రాత్రి 8గంటల సమయంలో కురువ స్వాములు మద్యం సీసా చేతితో పట్టుకుని సత్యనారాయణ ఇంటి ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి, పొలం నాది, బయటకు రా... నీ అంతు చూస్తా అంటూ బెదిరించాడు. ఈ ఘటనపై సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కురువ స్వాములుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడిపై దాడి చేసిన వీధి కుక్కలు


వీధికుక్కల దాడిలో గాయపడిన హసన్

జడ్చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని 24వ వార్డులో బుధవారం కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న హసన్‌ను వీధికుక్కలు దాడి చేశాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఒక్కసారిగా హసన్‌పై దాడి చేశాయి. చెంప, చేతిపై కుక్కలు గాట్లు పెట్టాయి. వెంటనే కాలనీవాసులు కుక్కలను తరమడంతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయాయి. మునిసిపాలిటీలోని పలు కాలనీలలో గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయని, వీటి కారణంగా చిన్నారులు, వృద్ధులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడేవిధంగా మునిసిపల్ అధికారులు, పాలకవర్గం సభ్యులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి ఒక్క రోజు జైలు శిక్ష చొప్పున న్యాయాధికారి విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం.. తాడూరు మండలం మేడిపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి దాసు, వంగూరు మండలం పోల్కంపల్లికి చెందిన విభూతి సైదులు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి కావ్య ఒక్క రోజు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

టైలర్ షాపులో అగ్నిప్రమాదం

- రూ. 20 లక్షల నష్టం


బాధితుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణం తిలక్‌నగర్ కాలనీ లోని బాలాజీ టైలర్ షాపులో అగ్ని ప్రమాదం బుధవారం తెల్లవారుజామున సంభవించింది. పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గుంజి మురళికి చెందిన ఈ దుకాణంలో విద్యుదాఘాతం కారణంగా మంటలు చెలరేగాయి. కుట్టు మిషన్లు, వివాహ శుభకార్యాలకు సంబంధించిన బట్టలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. కాగా, బాధితుడిని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పరామర్శించారు.

నాటుసారా సరఫరా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అమ్రాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా అక్రమంగా తరలిస్తున్న అమ్రాబాద్ మండలంలోని టీకే.లక్ష్మాపురంతండాకు చెందిన ఎం.హనుమంతుపై కేసు నమోదు చేసినట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనంతోపాటు పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం విలేకర్లకు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో నాటుసారా లభ్యమైందని ఆయన తెలిపారు. ఎక్సైజ్ అధికారులు బంతిలాల్, నవీన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన పంచాయితీ

- మలుపులు తిరుగుతున్న కమిషనర్, మాజీ కౌన్సిలర్ గొడవ
- కార్పొరేషన్ అధికారులు మూకుమ్మడిగా కలెక్టర్‌కు ఫిర్యాదు
- అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన కమిషనర్
- కట్టాను అరెస్టు చేసి రిమాండ్ చేసిన పోలీసులు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నోటి దురుసు పెద్ద వివాదానికే దారితీసింది. ప్రజాప్రతినిధి, అధికారి మధ్య జరిగిన ఫోన్ పంచాయితీ కాస్త రచ్చకెక్కింది. రోజంతా పరిణామాలు హాట్‌హాట్‌గా ఉండగా, నగరంలో బుధవారం ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. నగరంలోని 7వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మధ్య జరిగిన గొడవ రోజంతా పలు మలుపులు తిరిగింది. కమిషనర్‌ను ఫోన్‌లో మంగళవారం కట్టా రవికిషన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారు. అంతటితో ఆగకుండా ఎక్కడున్నావో చెప్పు వస్తా అంటూ సరాసరి కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌కు వెళ్లి బైఠాయించాడు. అప్పటికే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లి మద్యం తాగిన శాంపిల్స్ సేకరించి రాత్రి 7 గంటల తరువాత సంతకాలు తీసుకుని పంపించారు.

ఆ తరువాత సీన్ మారింది. కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి రూరల్, టూటౌన్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లతో పాటు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి రాత్రి పొద్దుపోయాక ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రాత్రే పోలీసులు మాజీ కౌన్సిలర్‌ను మళ్లీ అదుపులోకి తీసుకుని వన్‌టౌన్‌కు తరలించారు. ఇక బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఉద్యోగులంతా కలిసి మూకుమ్మడిగా కలెక్టరేట్ చేరుకుని కలెక్టర్ విజయేందిర బోయితో పాటు అడిషినల్ కలెక్టర్, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రతాప్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

మాజీ కౌన్సిలర్ రిమాండ్

కమిషనర్‌ను దూషించిన మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసులు విచారణ అనంతరం ఆయనను జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా, రిమాండ్‌కు పంపారు. అనంతరం జిల్లా జైల్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపారు.

● ఉద్యోగులు మనోధైర్యం కోల్పోతారు..

తనను అసభ్య పదజాలంతో దూషించిన మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఇంతటి సంస్కారహీనంగా మాట్లాడిన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోకపోతే నాకింది స్థాయి ఉద్యోగులు కూడా మనోధైర్యం కోల్పోయే అవకాశం ఉంటుంది. వారికి కూడా భవిష్యత్తులో రక్షణ ఉండదు. ఆడవాళ్ల గురించి సంస్కారహీనంగా మాట్లాడే ఎంతటి నాయకుడినైనా సమాజం క్షమించదని చెప్పారు. రాబోయే రోజుల్లో దీన్ని పర్యవసానం ఎదుర్కోక తప్పదన్నారు.

- ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్

కాంగ్రెస్‌తో సంబంధం లేదు

కట్టా రవికిషన్‌రెడ్డికి తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, బీఆర్ఎస్ పార్టీ బీఫాం మీద గెలిచిన ఆయన ఆ పార్టీలో ఉన్నారని కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, ఖాజాపాష అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసిన ఆయనను పార్టీలో చేర్చుకోలేదని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న పాలమూరులో బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కమిషనర్‌పై రాయలేని భాషలో దుర్భాషలాడిన మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలించాలని డిమాండ్ చేశారు.

రైతులకు బోనస్ తప్పకుండా ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


రైతు దీక్ష ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు ఇచ్చిన రైతుబంధు, రైతు బీమా, కష్టాలు పడి పండించిన వరికి బోనస్ ఎట్టి పరిస్థితిలో తప్పకుండా ఇవ్వాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ ఇవ్వకుంటే రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కాంగ్రెస్ నాయకుడిని ప్రజలు పల్లెల్లో తిరగకుండా చేస్తారని హెచ్చరించారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని టైరోడ్డు 167వ జాతీయ రహదారి పక్కన బుధవారం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రైతు దీక్షకు ఆయనతో పాటు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఆర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ రాష్ట్రానికి అన్నం పెట్టే రైతులు, ఫర్టిలైజర్ల మీద ఆంక్షలు పెట్టి నడ్డి విరిచేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నద న్నారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులు ఎదురు తిరిగే పరిస్థితులు దగ్గర్లో ఉన్నాయని అన్నారు. హైకోర్టు ప్రభుత్వానికి సెప్టెంబరు 30 కల్లా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినా, స్థానికంలో ఓడిపోతాం అనే భయంతో, 42 శాతం ఓబీసీ రిజర్వేషన్ సాకుతో ఎన్నికలకు వెళ్లకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ఏనాడైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు సరిగ్గా కట్టిందా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే దాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రజల వైపు ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు. ఎస్ఆర్ రెడ్డి మాట్లాడుతూ... యూరియా కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 21 నెలలు గడుస్తున్నా 1వ తేదీకి ఏ ఉద్యోగికైనా జీతాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మండలాల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, శివరాజ్ పాటిల్, మాజీ సర్పంచ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివప్ప, నాయకులు రామకృష్ణ, దాణి, గిర్ని , శంక్రప్ప, తిప్పయ్య, శివరామరాజు, వెంకటరమణ రాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

తాగిన మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి హల్‌చల్

- కొల్లాపూర్‌లో ఒడిస్సా యువకుడి నిర్వాకం
- గంట పాటు విద్యుత్ అంతరాయం
- యువకుడిని బంధించి కిందికి దింపిన ఏఈ ఉమేష్ గౌడ్


ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి యువకుడిని బంధించి కిందికి దింపుతున్న ట్రాన్స్‌కో ఏఈ ఉమేష్ గౌడ్

కొల్లాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాగిన మద్యం మత్తులో ఓ యువకుడు సబ్‌స్టేషన్‌లోకి దూసుకుపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో ఆపరేటర్ వెంటనే తేరుకొని విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో కాలిన గాయాలతో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని చౌటబెట్ల రహదారిలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన యువకుడు బుధవారం రాత్రి 9 గంటలకు తాగిన మత్తులో వెళ్లాడు. చకచకా ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. షార్ట్ సర్క్యూట్ అయ్యి వచ్చిన నిప్పురవ్వలతో యువకుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. అయినా మొండిపట్టుతో కిందికి దిగకుండా గంట పాటు అందరిని ఆశ్చర్యపరిచాడు. కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కిందికి దిగాలని బతిమిలాడిన వినలేదు. అతని చేతిలో ఉన్న కర్రలతో కింద ఉన్న పోలీసులపై విద్యుత్ సిబ్బందిపైకి దాడి చేశాడు.

● పోలీసులతో పాటు కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రజలంతా యువకుడిని కిందికి దిగాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. చివరికి ట్రాన్స్‌కో ఏఈ ఉమేష్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని సిబ్బందితో కలిసి యువకుడిని కిందికి దింపే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఏఈ ధైర్య సాహసం ప్రదర్శిస్తూ తానే స్వయంగా చీకటిలో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి యువకుడి వద్దకు చేరుకున్నాడు. ఈ క్రమంలో యువకుడు ఏఈపై కాళ్లతో దాడి చేసినా బెదరకుండా అలాగే యువకుడిని ఒంటి చేత్తో గట్టిగా బంధించాడు. వెంటనే విద్యుత్ సిబ్బంది అంతా యువకుడు వద్దకు వెళ్లి అతన్ని తాళ్లతో బంధించి కిందికి దింపారు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏఈ ఉమేష్ గౌడ్ ధైర్య సాహసాన్ని చూసి అక్కడున్న వారంతా ప్రశంసించారు. యువకుడిని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు.

యూరియా కోసం అన్నదాతల గోస



తాడూరు మండలం మేడిపూర్ రైతు ఆగ్రో సేవా కేంద్రం ముందు యూరియా కోసం లైన్‌లో వెళ్తున్న అన్నదాతలు

తాడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్, మేడిపూర్ గ్రామాల్లో ఉన్న రైతు ఆగ్రో సేవా కేంద్రాల ముందు రైతులు బుధవారం తెల్లవారుజాము నుంచి యూరియా కోసం బారులు తీరారు. అదేవిధంగా మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం సైతం వందల మంది రైతులు లైన్‌లో నిలబడ్డ ఘటన చోటు చేసుకుంది. బుధవారం తాడూరు మండలంలో మూడు పంపిణీ కేంద్రాలను కలుపుకుని 900 బస్తాల యూరియా పంపిణీ చేశారు.

● హన్వాడ: హన్వాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో బుధవారం యూరియా కోసం అన్నదాతలు క్యూ కట్టారు. 900 బస్తాల యూరియాను సొసైటీ సిబ్బంది రైతులకు పంపిణీ చేశారు. పోలీసులు, వ్యవసాయ అధికారుల సమక్షంలో రైతులను క్యూలో పెట్టి అందించారు. అయితే ఈ నెల 14, 17 తేదీలలో టోకెన్లు ఇచ్చిన రైతులకు యూరియా అందించారు. కొత్తగా వచ్చినవారికిటోకెన్లు ఇచ్చి పంపించారు.

● దేవరకద్ర: దేవరకద్ర, మండలంతో పాటు, సహకార సంఘం కార్యాలయం, దేవర కద్ర మనగ్రోమోర్ వద్ద బుధవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రైతుల పంటలకు కావలసిన యూరియా కోసం ప్రతీ రోజు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

రెండు కేంద్రాల వద్ద దాదపు 400 మంది రైతులు తీసుకు నేందుకు వచ్చి భారీగా క్యూలో నిలబడ్డారు. దీంతో ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తున్నారు. దీంతో మరికొంత మందికి యూరియా దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

● అమ్రాబాద్: అమ్రాబాద్ మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధవారం కార్యాలయం వద్దకు యూరియా రావడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మండల వ్యవసాయ అధికారి మహేష్‌రెడ్డి, ఏఈవో రమేష్, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో రమణమ్మ, అకౌంటెంట్ బాలు, అమ్రాబాద్ పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.

రైతుల ఆందోళన

- మూసాపేటలో రైతుల పడిగాపులు


పోల్కంపల్లి సింగిల్ విండో వద్ద రైతుల పడిగాపులు

మూసాపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోల్కంపల్లి సింగిల్ విండో కార్యాలయం వద్ద గుంపులుగా రైతులు చేరుకుని యూరియా కోసం ఆందోళన చేపట్టారు. రైతులందరికి సరిపడ్డా యూరియాను సకాలంలో అందజేయాలని వారు డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం జానంపేట రైతువేదిక, పోల్కంపల్లి సింగిల్ విండో కార్యాలయం, మూసాపేటలో రెండు ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్దకు యూరియా లోడ్లు వస్తున్నాయనే సమాచారం తెలుసుకున్న రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. మండల వ్యవసాయాధికారి అనీల్‌కుమార్, ఏఈవోలు, పోలీస్ సిబ్బంది సమక్షంలో రైతులకు సంబంధించిన భూమి పత్రాలు, పంటసాగు విస్తీర్ణం పరిశీలించి ఎరువులను అందజేశారు. జానంపేట వద్దకు తక్కువ లోడు రావడంతో రైతులకు సరిపడ్డా యూరియా సరఫరా కాలేదని చక్రపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మూసాపేటలో ఎరువుల కోసం రైతులు టోకెన్లు పొంది బారులు తీరారు.

ఆల్‌ఇండియా పోలీస్ రెజ్లింగ్‌లో

కాంస్య పతకం పొందిన రాధిక



కానిస్టేబుల్ రాధిక

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ (ఆర్మ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్) 2025-26లో జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుల్ రాధిక కాంస్య పతకం గెలుచుకున్నారు. హన్మాడలో ఈనెల 20-24 వరకు నిర్వహించిన క్రీడల్లో అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌కు చెందిన తెలంగాణ పోలీస్ మహిళా ఆర్మ్ రెజ్లింగ్ క్రీడాకారిణి రాధిక 80 ప్లస్ కేటగిరిలో అద్భుత ప్రతిభ కనబరిచారు. కాంస్య పతకం సాధించిన పాలమూరు క్రీడాకారిణి రాధికను ఎస్పీ అభినందించారు. ఆమె కృషి, పట్టుదల, క్రీడా స్ఫూర్తి ఇతర పోలీస్ సిబ్బందికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది క్రీడా రంగంలో ప్రతిభ చాటడం గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారులు రాణించి, జాతీయ స్థాయికి ఎదగాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,17, 19 బాక్సింగ్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల,బాలికల జట్ల ఎంపికలను బుధవారం స్టేడియం మైదానంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను డీవైఎస్‌వో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో క్రీడల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని, రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జిల్లా జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, బాక్సింగ్ కోచ్ నరసింహ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జట్టు వివరాలు...

అండర్-17 : బాలురు: శ్రీరామ్, విఝ్‌కుమార్, మణికౌషిక్, చరణ్‌సాయి, నాగచైతన్య

అండర్-19 : సంతోష్‌నాయక్, అజయ్

అండర్-17: బాలికలు :వైష్ణవి, మధులత, జోగుస్విల్ల, అనూష, సరస్వతి

అండర్-19 : శ్రీలేఖ

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన ఆర్చరీ క్రీడాకారులను అభినందిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో ఆర్చరీ పురుషుల విభాగంలో క్రీడాకారులను బుధవారం పీయూలో ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిని పీయూ పీడీలు, సెలక్షన్ కోచ్‌లు ఎంపికలు జరిపారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడకారులను ఎంపిక చేశారు.

క్రీడాకారులు మంచి ప్రదర్శన కనబరిచి విజయం సాధించాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ కోరారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో వచ్చే నెల 20 నుంచి 30 వరకు జరుగు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యభాస్కర్, పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాస్, కోచ్ జ్ఞానేశ్వర్, మేనేజర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సైబర్ నేరాలపై అవగాహన

నవాబ్‌పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నవాబ్‌పేటలో బుధవారం ఏఎస్‌ఐ జనార్దన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేస్తే ఖాతాలో డబ్బులు మాయం అవుతాయన్నారు. ఎవరైన సైబర్ మోసాలకు గురైతే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం పోలీసు కళాజాత బృందం పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

కఠినంగా శిక్షించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్‌పై దుర్భాషలాడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న కమిషనర్‌పై అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గు చేటు అన్నారు. ఏదైనా సమస్య ఉంటే న్యాయ బద్ధంగా పరిష్కరించుకోవాలి. లేదా కమిషనర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గండీడ్ సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నామని ఎంపీడీవో హరిచ్చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ఉపాధి హామీ కూలీలు, యువజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ రాజుకు అస్వస్థత

మిడ్జిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వెంటనే అస్వస్థతకు గురయ్యారు. ఎడమ చేయి గుంజుతూ నొప్పి రావడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గుండెనొప్పి వచ్చినట్లు అక్కడ వైద్యులు నిర్ధారించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

బస్సులో పోగొట్టుకున్న డబ్బులు అప్పగింత

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లాల్‌కోటకు చెందిన సావిత్రి బుధవారం మహబూబ్‌నగర్ నుంచి శంషాబాద్ వెళ్తూ బస్సులో రూ.15 వేలు పోగొట్టుకుంది. ఆ డబ్బులను డ్రైవర్ శేఖర్ దొరకగా, ప్రయాణికురాలికి బస్టాండ్ కంట్రోలర్ వహీదుద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు సమక్షంలో అందజేశారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

దేవరకద్ర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రి, ఉప కేంద్రాలకు వచ్చే రోగులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గూరకొండ ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనికీ చేసి, రోగుల సంఖ్య, తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాత బిల్డింగ్, స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ దీపిక తదితరులు పాల్గొన్నారు.


అమిస్తాపూర్ సరస్వతీ ఆలయంలో సంతాన లక్ష్మీగా అమ్మవారు


వెండిపోచమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా


అన్నపూర్ణాదేవిగా పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు


దేవరకద్రలో అన్నపూర్ణాదేవిగా దుర్గామాత

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

- హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు
- లలిత సహస్ర నామాలు ఆలపించిన భక్తులు


చిన్నదర్పల్లిలో అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


లలిత సహస్ర నామాలు ఆలపిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల/భూత్పూర్/గండీడ్ /దేవరకద్ర/నవాబ్‌పేట/హన్వాడ/మిడ్జిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం అమ్మవారిని గాయిత్రీదేవిగా, అన్నపూర్ణాదేవీగా, వైష్ణవీ దేవిగా అలంకరణ చేసి కుంకుమార్చన, మంగళహారతి ఇచ్చారు. బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవిగా, వెండిపోచమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో వైష్ణవీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. రేణుక ఎల్లమ్మ, అంబా భవానీ, కొత్త గంజిలోని లక్ష్మీ నరసింహా ఆలయం, పోచమ్మ ఆలయం, షిర్డీ సాయి మందిరం, బండమీదిపల్లిలోని లక్ష్మీదేవీ ఆలయం, ఏనుగొండ ఆలయంలో, శివశక్తినగర్‌లో, చిన్నదర్పల్లి గ్రామంలోని అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చేసిన అన్నదాన వితరణలో పాల్గొన్నారు. బ్రాహ్మణవాడిలో సాయంత్రం అమ్మవారిని హంసవాహనంపై పల్లకీ సేవ రాంమందిర్ చౌరస్తా నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు సాగింది. జడ్చర్ల పట్టణంలోని సకలదేవతల ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారికి కూరగాయలతో అలంకరించి, సామూహిక కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి నవదుర్గ అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని మూల విరాట్ వాసవీకన్యరా పరమేశ్వరి దేవి బ్రహ్మీదేవి అలంకారంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విద్యానగర్‌కాలనీలోని రేణుక ఎల్లమ్మ, కావేరమ్మపేటలోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చింది. భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ శివారులో ఉన్న సరస్వతీ ఆలయంలో అమ్మవారు భక్తులకు సంతాన లక్ష్మీగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దంపతులు హోమం చేశారు. గండీడ్ మండల కేంద్రంలో దుర్గామాత అన్నపూర్ణాదేవీగా భక్తుకు దర్శనం ఇచ్చారు. దేవరకద్ర మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి, వాసవీ ఆలయం ఏర్పాటు చేసిన దుర్గామాతను అన్నపూర్ణాదేవీగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇవ్వగా, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హన్వాడ మండల కేంద్రంలో దుర్గాదేవీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే ఇబ్రహీంబాద్, పెద్దదర్పల్లి, టంకర, వేపూర్, షేక్‌పల్లి, కిష్టంపల్లి గ్రామాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిడ్జిల్ మండలం వాడియాల గ్రామంలో టీఎన్‌జీవో తాలుకా అధ్యక్షుడు తిరుపతయ్య దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


జడ్చర్లలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు


వెండి పోచమ్మ ఆలయంలో పల్లకీసేవ

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ విజయేందిర బోయి


మల్లెబోయిన్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. జడ్చర్ల మండలం మాచారం, మల్లెబోయిన్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మల్లెబోయిన్‌పల్లిలో 70 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు యాదమ్మతో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో ఇల్లు నిర్మాణం చేపట్టావు, దశల వారీగా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయా, ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందని ఆరా తీశారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అనంతరం మాచారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నిర్మించారనే అంశాన్ని స్వయంగా పరిశీలించి, త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట మండలం తుంకినిపూర్ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే గర్భిణి బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆమెకు ఉదయం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో జానంపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు జనరల్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా భూత్పూర్ సమీపంలోని కలెక్టరేట్ వద్దకు రాగానే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ ఈఎంటీ యాదయ్య, పైలట్ హైమద్, ఆశా కార్యకర్త స్వరూప నర్సు పుష్ప కలిసి అంబులెన్స్‌లో సుఖ ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఆమెను జనరల్ ఆసుపత్రికి తరలించి డాక్టర్‌కు చూపించారు. పరీక్షించిన డాక్టర్లు తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

మిడ్జిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రానికి 90.45 టన్నుల యూరియా వచ్చిందని, రైతులకు సరిపడా యూరియా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అధిక మోతాదులో యూరియా వాడరాదని, పంట అవసరానికి తగ్గట్టే వాడాలన్నారు. ఏవో సిద్ధార్థ, ఏఈవో సాయికృష్ణ, భగత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లు గ్రామాలను దత్తత తీసుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాలను దత్తత తీసుకోవాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీలోని ఫార్మసీ ఆడిటోరియంలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించగా, ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలన, అక్షరాస్యత, పారిశుధ్యం, రక్తదాన శిబిరాలు, ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు మాట్లాడుతూ వలంటీర్లు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, అకాడమిక్ ఆడిట్‌సెల్ డాక్టర్ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

దసరా వేడుకలకు జడ్చర్లకు ప్రత్యేక శోభ


జడ్చర్ల హౌజింగ్ బోర్డు వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం


దుర్గామాత చిత్రం

జడ్చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా వేడుకల సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించేలా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. హౌజింగ్‌బోర్డు కాలనీ నుంచి క్రాస్ రోడ్డు మీదుగా సిగ్నల్‌గడ్డ, కల్వకుర్తి రోడ్డు వరకు, సిగ్నల్‌గడ్డ నుంచి నిమ్మబావి గడ్డకు వెళ్లే దారిలో స్వాగత తోరణాలతో ఉన్న విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు. సిగ్నల్‌గడ్డ వాటర్ ట్యాంకు వద్ద అయోధ్య రామమందిరంతో పాటు శ్రీరాముడిని మొక్కుతున్న ఆంజనేయుడిగా, తహసీల్దార్ కార్యాలయ చౌరస్తా వద్ద దుర్గామాత తో కూడిన విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

28న బీపీ మండల్ విగ్రహం ఆవిష్కరణ

భూత్పూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీపీ మండల్ విగ్రహావిష్కరను విజయవంతం చేయాలని యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు తెలిపారు. బుధవారం మునిసిపాలిటీ కేంద్రంలోని మునిరంగ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకటనర్సయ్య యాదవ్, రవికుమార్ యాదవ్, శాంతన్న లక్ష్మీ నరసింహా యాదవ్ మాట్లాడారు. స్వాతంత్య్ర అనంతరం 45 ఏళ్ల తరువాత బీపీ మండల్ సిఫారసు మేరకు సమస్త బీసీలకు కేంద్ర ప్రభుత్వాల్లో రిజర్వేషన్లు వచ్చాయని వారు గుర్తు చేశారు. అటువంటి నాయకుడి విగ్రహాన్ని మన జిల్లాలో ఏర్పాటు చేసుకోవడం సంతోషం అన్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ యాదవ్, నాయకులు వెంకట్‌నారాయణ, కడప నారాయణ, ఊశన్న, రాములు, రెడ్డికుంట వెంకటేష్, బాలస్వామి, లక్ష్మీనారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

భూత్పూర్ మునిసిపాలిటీకి రూ.16 కోట్ల నిధులు


అధికారులకు ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం రూ.16 కోట్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్‌కు అందించారు. ప్రజాపాలనలో ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావలసిన అభివృద్ధి పనులు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, రూరల్ అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు భూపతిరెడ్డి, నాయకులు నర్సింహులు, పవన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, మన్నెం, రావులపల్లి నర్సిములు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో శ్రద్ధగా చదివితే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారని ప్రముఖ కమెడియన్, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఫ్రెషర్ డే నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఇప్పుడు కష్టపడితే జీవితం మొత్తం సుఖపడవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నటులు చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ తదితర వాయిస్ మిమిక్రీ చేస్తూ విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి, డా.వీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు


తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లి సెజ్‌లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్లకు ఆంక్షలు లేకుండా సర్వ హక్కులు కల్పించాలని కోరుతూ యువజన సంఘాల ఆధ్వర్యంలో నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన వినతి పత్రంను బుధవారం జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావుకు యువజన సంఘాల సభ్యులు అందజేసి, మాట్లాడారు. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్లను కొందరు రియల్టర్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటిని రద్దు చేయాలని, సెజ్‌లోని ఫార్మ కంపెనీల నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కుప్పలుగా పోసి కాల్చుతున్న వాటిని నిరోధించాలని, సెజ్‌లోని పరిశ్రమలో అవకాశాలు కల్పించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో గ్రామ యువజన సంఘం సభ్యులు ఆంజనేయులు, యాదయ్య, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

'మావోడి పెళ్లి' పాట చిత్రీకరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లా కేంద్రంలో యశస్వి మీడియా హౌజ్ సమర్పిస్తున్న 'మావోడి పెళ్లి' పాట చిత్రీకరణ బుధవారం పట్టణంలోని తిరుమల హిల్స్‌లో జరిగింది. ధూమ్ డాన్స్ అకాడమీ అజీమ్ మాస్టర్, వైష్ణవి ఆశ అకాడమి విజయలక్ష్మి నృత్య దర్శకత్వంలో పాట షూటింగ్ జరిగింది. పాలమూరు పట్టణ వాసి చందుయాదవ్ క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వెంకట్‌రెడ్డి స్విచ్ ఆన్ చేశారు. సంగీత దర్శకుడు సోమేష్‌కుమార్, యశస్వి మీడియా అధినేత నాగభూషణ్, రాజు, విక్టర్, ఆర్నాల్డ్, నటీ నటులు రోమీ, స్వర్ణలత, భార్గవిరెడ్డి, సతీష్, తిరుమల, అశోక్, అడ్వకేట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

గండీడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివా హిత ఇంట్లో గొడవ పడి అదృశ్యమైన సంఘటనమండలం కొంరెడ్డిపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వివాహిత పెద్దల పండుగ (అమావాస్య) రోజు ఇంట్లో భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లి పోయింది. ఇంట్లోని సభ్యులందరు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా జాడ దొరకలేదు. సదరు మహిళ తండ్రి బుధవారం ఇచ్చిన ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మూసాపేటలో బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మూసాపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంతో పాటు కొమిరెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆటపాటలతో మార్మోగించారు. కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యురాలు పాల్గొన్నారు. అంతకుముందు కొమిరెడ్డిపల్లిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన దుర్గామాత పూజల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్, నాయకులు నర్సింహారెడ్డి, బాలరాజు ఉన్నారు.

పంటల పరిశీలనలో శాస్త్రవేత్తలు

మిడ్జిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగొమ్ముల, చిలువేరు, మున్ననూర్ గ్రామాల్లోని బుధవారం తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ అనూష, డాక్టర్ బి.మల్లయ్య వరి, కంది పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు పంటల పెరుగుదల, వ్యాధుల నివారణ, దిగుబడుల మెరుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పంటల సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగంపై వివరించారు. దీంతో పాటు రైతులు పంటల సంరక్షణ గురించి పలు విషయాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో అస్రఫాతిమా పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు

పాలమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై మాజీ కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు చేయటంపై గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, కె.వరప్రసాద్ ఖండించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి మాజీ కౌన్సిలర్ ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. గెజిటెడ్ ఉద్యోగులు చేస్తున్న విధులకు ఆటంకం కలిగించటంపై కలెక్టర్ రక్షణ కల్పించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీజీవో నాయకులు కె.టైటస్‌పాల్, యాదగిరి, తానాజీ, డా.కె.ఎస్ నరేష్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ దేవేందర్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.